



దరఖాస్తుల కౌంటర్ పరిశీలిస్తున్న కలెక్టర్

నగర పాలకలో సమస్యల తిష్ట



- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- దృష్టి సారించని పాలకులు, అధికారులు
- నేడు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం

కర్నూలు నగర పాలక సంస్థల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయి. దానికి తోడు అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. సమస్యల పరిష్కారంపైన, అభివృద్ధి పనుల పైన పాలకులు, అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో కార్పొరేషన్ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారా? లేదా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ఉన్న 52 వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కావాల్సిన నిధులు ప్రభుత్వం నుండి రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. సంవత్సరకాలంగా కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు రాక ఏమి చేయాలో తోచక చివరికి పనులు ఆపేసి కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలోని లక్ష్మీ నగర్, శ్రీరామ్ నగర్‌లో వర్షం పడినప్పుడల్లా కాలువలు పొంగి పారుతున్నాయి.

అంపశయ్యపై గడియారం ఆస్పత్రి

కర్నూలు నగరం ఏర్పడినప్పటి నుంచి పాతబస్తీలో ఉన్న గడియారం ఆసుపత్రి పరిస్థితి అంపశయ్యపై చేరింది. ఆసుపత్రి గోడలు బీటలు వారాయి. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, మందులను, తాగునీటి వసతి కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారు.

పడకేసిన పారిశుధ్యం

కర్నూలు నగరంలోని 52 వార్డులలో ఉన్న సుమారు 6 లక్షల జనాభాకు తగినంత పారిశుద్ధ కార్మికులు లేకపోవడంతో ప్రధాన వీధులలో ప్రజా ప్రతినిధులు ఉండే ప్రాంతాల్లో తప్ప మిగతా ప్రాంతాలన్నీ చెత్తతో నిండిపోతున్నాయి.

కనీస సౌకర్యాలు లేవు...

శివారు కాలనీలలో కనీస అవసరాలైన రోడ్లు, మురికి కాలువలు, వీధిలైట్లు లేక ఆ ప్రాంతంలోని ప్రజలు వర్షాలు పడితే వీధులలో బురద చేరి ఇంట్లో వారు ఇంట్లో బయటివారు బయటే అన్న విధంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు ఖాళీ ప్రదేశాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి కాలువలు లేని కారణం చేత ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు చేరి పందులకు, దోమలకు, పాములకు నిలయంగా మారుతున్నాయి. గతంలో టిడిపి ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో సముదాయాల్లో కనీస వసతులు లేకపోవడంతో వాటిలో చేరేందుకు లబ్ధిదారులు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

రక్షణ లేని పార్కులు

ప్రతి వార్డులో పార్కులో ఉంటాయి. ఆ పార్కు కనీసం ఇతరులు కబ్జా చేయకుండా చుట్టూ కంచ వేసి రక్షించాల్సింది పోయి వాటిని పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతం లో పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు, మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. అలాంటి వాటిపై వార్డులలో ఉన్న సచివాలయాల సిబ్బంది పరిశీలించి వాటి అభివృద్ధికి కృషి చేసే విధంగా అధికారుల దృష్టికి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భయపెడుతున్న కుక్కల బెడద

నగరంలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగాయి. పాతబస్తీలో గత నెలలో కుక్కలు పిల్లలను కరిచాయి. ఆ సమయంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. కుక్కల నియంత్రణ ఆపరేషన్ చేసే ఏజెన్సీకి గుర్తింపు సర్టిఫికెట్ లేదని కలెక్టరుకు ఫిర్యాదు అందడంతో ఆగస్టు నుండి కుక్కల నియంత్రణ ఆపరేషన్లు ఆపేశారు. దీంతో సమస్య జటిలమైంది.

హంద్రీ, తుంగభద్ర ఆక్రమణలు

కర్నూలు నగరానికి అనుకొని తుంగభద్ర, మధ్యలో హంద్రీ, కెసి కెనాల్‌లు ఉన్నాయి. వాటిని ఆనుకొని ఉన్న స్థలాలను ఆక్రమించడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు పోవడానికి వీలు లేక ఆక్రమణలకు గురైన కాలనీలో నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన వస్తోంది.

పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



నగరంలో ఏళ్ల కాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలి. నగర జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలి. పార్కుల రక్షణకు చర్యలు తీసుకోవాలి. రోడ్లు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

- ఎం.రాజశేఖర్, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి.

రీసర్వే సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- గ్రామ సచివాలయం తనిఖీ - హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన
- ఉల్లి రైతులతో ముఖాముఖి - కర్నూలులో గూడెం తరహా మార్కెటింగ్‌కు హామీ

ప్రజాశక్తి - గోనెగండ్ల



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

గతంలో నిర్వహించిన భూ రీసర్వేలో తలెత్తిన సమస్యలను సమగ్రంగా పరిష్కరించడానికే ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం గోనెగండ్ల మండలం కున్నూరులో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామసభ నిర్వహణ తీరు, దరఖాస్తుల కౌంటర్‌ను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా రెండు రకాల సమస్యలను రైతులు లేవనెత్తుతున్నారని చెప్పారు. మొదటిది విస్తీర్ణంలో తేడాలు, రెండవది ఒకే ఎల్‌పిఎం నెంబర్ ఎక్కువ మంది రైతులకు ఉమ్మడిగా కేటాయించడం గుర్తించామని అన్నారు. ఈ సమస్యలను క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైతే సిబ్బంది భూముల సర్వేను తిరిగి నిర్వహిస్తారని తెలిపారు.

గ్రామ సచివాలయం తనిఖీ..

హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలన

అనంతరం కున్నూరు గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సచివాలయంలో ప్రధానంగా ఎలాంటి సేవల కొరకు దరఖాస్తులు వస్తున్నాయి? పెండింగ్ ఏమైనా ఉన్నాయా అని డిజిటల్ అసిస్టెంట్‌ను కలెక్టర్ అడిగి ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం మెనూ ప్రకారం నాణ్యతతో ఉండాలని, క్రమం తప్పకుండా గుడ్డును అందజేయాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదులు, టాయిలెట్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా భూ సర్వే అధికారి ముని కన్నన్, సర్వే ఇన్స్పెక్టర్ విజయకుమారి, తహశీల్దార్ కుమారస్వామి, ఎంపిడివో మణి మంజరి, ఏడిఏ ఖాద్రి, ఏవో హేమలత, ఏపీవో మహమ్మద్ బాష, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ -2 నీలకంఠ, ఆర్ఐ జగన్నాథ రావు, సర్పంచ్ వెంకటేష్, టిడిపి నాయకులు రమణ పాల్గొన్నారు.

ఉల్లి రైతులతో ముఖాముఖి

- కర్నూలులో గూడెం తరహా మార్కెటింగ్‌కు హామీ

కున్నూరు క్రాస్ రోడ్ సమీపంలో ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్న రైతులతో కలెక్టర్ రంజిత్ బాషా ముఖాముఖి మాట్లాడారు. ఏ రకం ఉల్లిని సాగు చేస్తున్నారు..? ఎకరాకు ఎంత ఖర్చవుతుంది..? దిగుబడి ఎలా ఉంది..? మహారాష్ట్ర ఉల్లికి ఇక్కడ ఉల్లికి తేడా ఏమిటి..? పండించిన ఉల్లిని ఎక్కడ అమ్ముకుంటున్నారు...? అని కలెక్టర్ రైతులని అడిగి తెలుసుకున్నారు. ఎక్కువమంది రైతులు తాడేపల్లి గూడెంలో అమ్ముకుంటున్నామని తెలిపారు. కర్నూలులో ఉల్లి మార్కెట్ ఉన్నప్పటికీ తాడేపల్లిగూడెంకే ఎందుకు వెళ్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. గూడెం మార్కెట్లో వెంటనే కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని, కర్నూలు మార్కెట్లో అలా కాకుండా రైతులకు టోకెన్ నెంబర్లు ఇచ్చి మరుసటి రోజు లేదా రెండు మూడు రోజులు కూడా ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని రైతులు చెప్పారు. గూడెం తరహా మార్కెటింగ్ కర్నూలు మార్కెట్లో కూడా చేపట్టేందుకు తగిన చర్యలపై కర్నూలు మార్కెట్ అధికారులతో మాట్లాడుతానని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. ఏడిఏ మహమ్మద్ ఖాద్రి, ఏవో హేమలత, ఉద్యాన సహాయకుడు మాదన్న, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేలో అవకతవకలను సరి చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ

కేతవరం గ్రామంలో జరిగిన భూ రీ సర్వేలో అవకతవకలను సరి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకష్ణ, మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్ మండలం కేతవరం గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలో గ్రామస్తులతో కలిసి సిపిఎం నాయకులు తహశీల్దార్ విద్యాసాగర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే పేరుతో అనేకమంది రైతుల భూములు ఎక్కువ తక్కువ రావడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. దళితులు, బీసీలు, అట్టడుగు ప్రజలు గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను ముళ్ళ పొదలు, బండరాళ్లను తొలగించి వేలకు వేలు ఖర్చుపెట్టి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అలాంటి పేదలకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నికల ముందు అనేకసార్లు మండల రెవెన్యూ అధికారులకు అర్జీలు పెట్టగా రీ సర్వే సందర్భంగా ఏ రైతు ఏ సర్వే నంబర్‌లో ఉన్నారో, ఎంత విస్తీర్ణంలో ఉన్నారో అనే విషయాన్ని సర్వే చేసి అసైన్మెంట్ కమిటీ ద్వారా కలెక్టర్‌కి పంపారని అన్నారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో అవన్నీ ఆగిపోయాయని చెప్పారు. తక్షణమే రీ సర్వేలో వచ్చిన రైతుల భూముల సమస్యలు పరిష్కరించాలని, సాగు చేసుకున్న పేదలను గుర్తించి నిజమైన లబ్ధిదారులకు పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షర్మిలా రెడ్డి, గ్రామ సర్పంచి గోవర్ధన్, టిడిపి నాయకులు నాగేశ్వర్ రెడ్డి, సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు, బుగ్గ రాముడు, వెంకటస్వామి, నాగరాజు, విఆర్ఓ నాగరాజు, సిబ్బంది, రైతులు నాగన్న, నాగరాజు, లక్ష్మీదేవి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన బైక్ సైలెన్సర్లు ధ్వంసం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న ఎస్‌పి

కర్నూలు నగరంలో అధిక శబ్దం కలిగించే 110 బైక్ సైలెన్సర్స్‌లను గురువారం జిల్లా పోలీసు కార్యాలయం కొండారెడ్డి బురుజు దగ్గర ఎస్‌పి జి.బిందు మాధవ్ రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. ఎవరైనా మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్నూలు పట్టణంలో గత 4 రోజులలో ట్రాఫిక్ పోలీసులు 60 సైలెన్సర్లు, నగర పోలీసులు 50 సైలెన్సర్లను సీజ్ చేశారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మీడియాతో మాట్లాడారు. కర్నూలు పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ద్విచక్ర వాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లను అమర్చుకొని 80 డెసిబల్స్ కంటే అధిక శబ్దం చేస్తున్న బైక్‌లను సైంటిఫిక్ పద్ధతిలో వాయిస్ పొల్యుషన్ సామాగ్రిని ఉపయోగించి పట్టుకున్నామన్నారు. ఆ వాహన దారులకు జరిమానాలు, వాహనాలు సీజ్, కేసులు నమోదు వంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు వెంకటరమణ కాలనీ, గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర వృద్ధులను, రోగులను ఇబ్బందులకు గురి చేస్తూ అధిక శబ్దం చేసే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. అధిక శబ్దం చేసే సైలెన్సర్లను వాహనాలకు విక్రయించే షాపుల యజమానులు, వాటిని బిగించే మెకానిక్‌లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా కౌన్సిలింగ్ చేస్తామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి జె.బాబు ప్రసాద్, కర్నూలు పట్టణ సిఐలు మన్సురుద్దీన్, నాగరాజారావు, రామయ్యనాయుడు, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

- త్వరలో 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే - డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్

క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. కర్నూలు మెడికల్ కళాశాల డాక్టర్ బీసీ.రాయ్ మీటింగ్ హాలులో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్ మాట్లాడారు. 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేను త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, స్టాఫ్ నర్సులు సర్వే ద్వారా గుర్తించిన వారిని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు, ఎఫ్‌బిడి కార్యక్రమానికి రెఫర్ చేసి, పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారిని పైస్థాయి ఆస్పత్రులకు పంపి చికిత్సలు, ఫాలో అప్ సేవలు అందిస్తారని చెప్పారు. ఆర్‌బిఎస్‌కె పిఒ హేమలత, ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ మంజూష, గైనకాలజిస్ట్ డాక్టర్ సాహిత్య జయ రామ్, డెంటిస్ట్ డాక్టర్ ఆదర్శ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'గ్రామసభ'

- తహశీల్దార్ నాగరాజు

ప్రజాశక్తి - తుగ్గలి

గతంలో నిర్వహించిన భూరీసర్వేలో తలెత్తిన సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. గురువారం తుగ్గలిలోని శ్రీసీతారాముల గుడి దగ్గర గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలున్న రైతులు అర్జీలు ఇచ్చారు.

ముస్లింల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి

ముస్లింలకు సంబంధించిన శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని ముస్లిం పెద్దలు తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ... ముస్లింలు ఎవరైనా మృతి చెందితే శ్మశానం లేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ముస్లిం శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. ముస్లిం మత పెద్ద అల్లా బకాష్, ఇర్ఫాన్, హయత్ బాషా, కరెంట్ బాషా, నజీర్ పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్ : మండలంలోని తడకనపల్లె గ్రామంలో మండల సర్వేయర్ శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ... భూమి సర్వే సమస్యలపై మొత్తం 147 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సర్పంచి షేక్ సాహెరాబీ, ఎంపిటిసి మధుసూదనమ్మ, గ్రామైక్య సంఘం అధ్యక్షులు షేక్ జుబేదాబీ, టిడిపి నాయకులు షేక్ షఫీ, షేక్ హుస్సేన్, షేక్ మహబూబ్ బాష, షేక్ సలాం పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వాస్పత్రిలో 'అన్న క్యాంటీన్' ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టిజి.భరత్ ప్రారంభించనున్నారు. కలెక్టర్ పి.రంజిత్ బాష, మేయర్ బివై.రామయ్య, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి పాల్గొనున్నారు.

డిఇఒగా శామ్యుల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు డిఇఒగా ఎస్.శామ్యుల్ పాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న డిఇఒ కె.శామ్యుల్ విజయవాడ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిఇఒ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.శామ్యుల్ పాల్‌ను డిఇఒగా నియమించడం పట్ల పలు వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

శామ్యుల్ పాల్ జిల్లాలో విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి పని పట్ల గౌరవం కలిగి నిబద్ధతతో విధులు నిర్వహించారు. సాధారణ ఉద్యోగి నుంచి అంచెలంచెలుగా డిఇఒ స్థాయికి ఎదిగారు. ఆయన తండ్రి ఉపాధ్యాయులుగా పని చేసి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ బాధ్యతలు మీద పడడంతో శామ్యుల్ పాల్ అనివార్య పరిస్థితిలో మెడిసిన్ విద్యను వదులుకొని జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. చదువులో అత్యంత ప్రతిభ పాటవాలు కలిగిన ఆయన శ్రీశైలం ఎపి రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యను నాగార్జున సాగర్‌లో పూర్తి చేశారు. జిల్లా విద్యాశాఖలో పరిపాలనదక్షులుగా ఆయనకు పేరుంది. ఉన్నతాధికారులు ఏ పని అప్పజెప్పినా పూర్తి చేయడం ఆయన నైజమని జిల్లా విద్యాశాఖలో పేరుంది. జిల్లాకు అనేక అవార్డులు తీసుకురావడంలో ఆయన కృషి అనిర్వచనీయం. వినయం, విధేయత కలిగిన ఆయన ఉపాధ్యాయ సంక్షేమానికి కృషి చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వివాదరహితుడిగా, విద్యాశాఖలో విద్యాభివృద్ధికి కృషి చేయడంలో ఆయన పాత్ర చాలా ఉంది. పదో తరగతి పరీక్షల సందర్భంగా 24 గంటలూ పనిచేస్తూ అన్ని స్థాయిలోని అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ జిల్లాకు వచ్చిన ప్రతి డిఇఒకు మక్కువైన అధికారిగా పనిచేయడం పట్ల ఆయనకు పేరుంది. జిల్లా విద్యాశాఖ చరిత్రలో ఆయనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.



యుటిఎఫ్ అభినందనయ : డిఇఒగా నియమితులైన శామ్యుల్ పాల్‌ను యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి అభినందనలు తెలిపారు. డిఇఒ శామ్యుల్ పాల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని పలు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ సూచించారు. గురువారం గౌలిగేరి 129వ సచివాలయంలో ఆధార్ క్యాంపును మేనేజర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శుక్రవారంతో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ముగిస్తాయని, వాటి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్స్, చిరునామా, మొబైల్ నెంబర్ వంటి సేవలను ఆధార్ క్యాంపుల్లో పొందవచ్చని తెలిపారు. అలాగే పదేళ్లు దాటిన పిల్లలు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. అనంతరం కొత్తపేట 128వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు అంశాలపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు.

శని, ఆదివారాలు మార్కెట్‌కు సెలవు

- మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

శని, ఆదివారాల్లో మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. కర్నూలు మార్కెట్ యార్డుకు 4 రోజులుగా ఉల్లి ఉత్పత్తులు 40 వేల బస్తాలకు పైగా క్రయవిక్రయానికి వచ్చాయని తెలిపారు. ఆన్‌లైన్ టెండర్‌లో సాంకేతిక లోపం కారణంగా బహిరంగ వేలం పద్ధతిలో టెండర్ డిక్లేర్ చేస్తామని చెప్పారు. ఉల్లి ఉత్పత్తుల కాటాలు, లోడింగ్ ఆలస్యం అవుతోంద ని తెలిపారు. రైతు, కమీషన్ దారులు ఉల్లి ఉత్పత్తులు రోజూ ఉదయం 5 నుంచి 10 గంటల వరకు మాత్రమే క్రయవిక్రయానికి అనుమతిస్తామని చెప్పారు. శని, ఆదివారాలు యార్డులో ఉల్లి క్రయవిక్రయాలు జరగవని, రైతులు, కమీషన్ దారులు గమనించాలని కోరారు.

డిఆర్‌ఒగా సివి.నారాయణమ్మ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



జిల్లా రెవెన్యూ అధికారిగా సివి.నారాయణమ్మను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం ప్రాజెక్టులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న నారాయణమ్మను డిఆర్‌ఒగా నియమించింది. అలాగే హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఫోర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న విశ్వనాథ్‌ను నంద్యాల ఆర్‌డిఒగా బదిలీ చేశారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన

ప్రజాశక్తి - సిబెళగల్

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రాణెమ్మ, తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రతి వినతికీ పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసులు, ఎంపిపి బొంతల మునెప్ప, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, డిప్యూటీ తహశీల్దార్ పురుషోత్తం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గోనె నాయక్, హౌసింగ్ ఎఇ సుమంత్, ఎఒ మల్లేష్ కుమార్ పాల్గొన్నారు.

బెళగల్‌ను అభివృద్ధి చేయాలి : సిపిఎం

మండలం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, బెళగల్‌ను క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి జె.మోహన్ ఎమ్మెల్యేను కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిపిఎం నాయకులు మోహన్ కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యేకు విన్నవించారు. చెరువును రిజర్వాయర్ చేసి సాగుకు, తాగుకు, ఉపాధికి, పర్యాటక కేంద్రానికి అనుగుణంగా అభివృద్ధి చేయాలని కోరారు. బస్టాండ్ కట్టించి, మార్కెట్ ఏర్పాటు చేసి, మహిళలకు మురుగుదొడ్లు, పోలకల్ నుంచి ఎమ్మిగనూరు వరకు రోడ్డు విస్తరణ, కెజిబివి నుంచి మోడల్ స్కూల్ వరకు రోడ్డు డివైడర్, సిసి రోడ్లు, వీధి లైట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంగాల, తిమ్మందొడ్డి, పలుకుదొడ్డి, సిఎం పల్లి, గొల్లల దొడ్డి, బురాన్ దొడ్డి, యనగండ్ల నుంచి కొండాపురం రోడ్లను అభివృద్ధి చేయాలని తెలిపారు. బెళగల్‌లో 50 పడకల ఆస్పత్రిని నిర్మించాలని డిమాండ్ చేశారు. రంగన్న, సుందర్ రాజు, ఏసు, ఆర్.దేవన్న, హుస్సేన్, అబ్రహాం పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

డిసెంబర్ 15లోపు రబీ పంటలకు ఇన్సూరెన్స్

- రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు డిసెంబర్ 15లోపు ఇన్స్యూరెన్స్ చేయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి పంటల బీమా అంశంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడారు. కౌలు రైతులు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులతో పంటలు నష్టపోయే అవకాశం ఉన్నందున వారితో ప్రతి పంటకు ఇన్స్యూరెన్స్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతులకు ఇన్స్యూరెన్స్ వచ్చే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా, జెసి డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వలస వెళ్లొద్దు

- ఎపిఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ మండలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఉపాధి కూలీలు ఉపాధి కోసం వలసలు వెళ్లొద్దని, ఉన్నచోటే పనులు కల్పిస్తామని పత్తికొండ ఎపిఒ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు చేస్తామని అడిగిన వెంటనే కూలీలకు పనులు కల్పిస్తామని తెలిపారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడొద్దని సూచించారు. ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పనులు గుర్తించారని అన్నారు. మరింత సమాచారం కోసం కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లులోని హాస్టల్‌తో పాటు లొద్దిపల్లెలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని సౌకర్యాలు, ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు.



తవ్వకాలను అడ్డుకుంటామంటూ నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

యురేనియం తవ్వకాలను అడ్డుకుంటాం

- కలిసికట్టుగా పోరాడతాం - కప్పట్రాళ్ల, చెల్లెల చెలిమిల గ్రామస్తులు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలు చేపడితే అడ్డుకుంటామని, కొండ చుట్టూ ఉన్న గ్రామస్తులందరూ కలిసికట్టుగా తవ్వకాల నిలుపుదలకు పోరాడతామని కప్పట్రాళ్ల, చెల్లెల చెలిమిల గ్రామస్తులు తెలిపారు. గురువారం ఆయా గ్రామాల ప్రజలు కొండ ప్రాంతానికి చేరుకుని 'శ్రీకౌలుట్ల స్వామి ఆలయ ఆవరణలో యురేనియం తవ్వకాలను అడ్డుకుంటాం. గ్రామాలను కాపాడుకుంటాం' అంటూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచులు చెన్నమ నాయుడు, మహేశ్వర రెడ్డి, టిడిపి నాయకులు మల్లికార్జున, టిడిపి పి.కోటకొండ నాయకులు మల్లెపల్లి రంగడు మాట్లాడారు. జల వనరుల శాఖ నుంచి 68 బోర్ల తవ్వకాలు చేపట్టడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిసిందని అన్నారు. తవ్వకాలు చేపడితే తీవ్ర అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని, పచ్చని పొలాలు బీళ్లుగా పారిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. యురేనియం తవ్వకాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి నిలుపుదలకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. తవ్వకాల అనుమతి రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పి.కోటకొండ గ్రామ పెద్దలు హనుమంతు రెడ్డి, ముచ్చు రామచంద్రుడు, రైతుసంఘం మండల నాయకులు సూరి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- టూ టౌన్ సిఐ సూర్య మోహన్‌రావు

ప్రజాశక్తి - ఆదోని



ప్రశంసా పత్రం అందిస్తున్న సిఐ

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై జీవితాలను అంధకారంలోకి నెట్టుకోవద్దని టూటౌన్ సిఐ సూర్యమోహన్ రావు తెలిపారు. ఆదోని డివిజన్‌లో గత నెలలో జరిగిన వ్యాస రచన పోటీలో గెలుపొందిన వారికి గురువారం ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రాంతి నగర్‌లోని సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాలలో గతనెలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలు, వాటి వల్ల జరిగే నష్టాల గురించి నిర్వహించిన వ్యాసరచన పోటీలో 10వ తరగతి విద్యార్థిని చి.స్రవంతికి కర్నూలు ఎస్పీ బిందుమాధవ్ నుంచి వచ్చిన ప్రశంసా పత్రాన్ని అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. వార్డు మహిళా పోలీసు హైమావతి, పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జాన్ డేవిడ్, ప్రధానోపాధ్యాయులు జి.కేశవయ్య, ఉపాధ్యాయులు నిర్మల మేరీ, ప్రకాశమ్మ, మాధవి, మరియమ్మ, నరసన్న, భారతి పాల్గొన్నారు.

బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలి : సిఐ



మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

యువతను బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత హైస్కూల్ ఉపాధ్యాయులపై ఉందని తాలూకా సిఐ నల్లప్ప తెలిపారు. గురువారం మండలంలోని పెద్దతుంబలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రహదారి నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సైబర్ నేరం బారిన పడితే వెంటనే 1930కి సమాచారం అందించాలని చెప్పారు. పెద్దతుంబలం ఎస్ఐ మహేష్ కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - సిబెళగల్

బెళగల్‌లో గురువారం ఎస్ఐ తిమ్మారెడ్డి వాహనాల తనిఖీ చేపట్టారు. కోడుమూరు సిఐ తబ్రేజ్ పర్యవేక్షణ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలకు, హెల్మెట్ ధరించని వాహన దారులకు, రోడ్డు నియమాలు పాటించని పది వాహనాలకు రూ.4,500 వరకు జరిమానా విధించారు. వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలని, అతి వేగం ప్రమాదకరమని పేర్కొన్నారు.

నిండుకుండలా తుంగభద్ర...

- నీట మునిగిన వరి పంట..!

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నది నిండుకుండలా పరవళ్లు తొక్కుతోంది. తుంగభద్ర జలాశయం నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర నదీతీరం జల సవ్వడితో గలగల పారుతోంది. మరోవైపు వరి పంట నీట మునగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



నీట మునిగిన వరి పంట

మండలంలోని మేలిగనూరు, నదీచాగి, కుమ్మలనూరు, కుమ్మలనూరు క్యాంపు, మురళి, గుడి కంబాలి, వల్లూరు గ్రామ రైతులు నదీతీరంలో వరి పంటను సాగు చేశారు. వరి పంట చివరి దశలో (కోత దశ) ఉంది. ఈ సమయంలో తుంగభద్ర వరద నీరు పంట పొలాల్లో చేరడంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇటీవల తుఫాన్ గాలికి వివిధ గ్రామాల్లో వరి పంట నేల వాలింది. ఈ సంఘటన నుంచి బయటపడక ముందే తుంగభద్ర జలాలు పంట పొలాల్లో చేరడంతో వరి రైతులకు దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉంది. ప్రతేడాది తుంగభద్ర నదీతీరంలో రైతులు పడుతున్న కష్టాలు వర్ణణాతీంగా ఉన్నాయి.

కంకి దశలో పంట నీట మునిగింది

- రైతు కృష్ణమూర్తి



వరి పంట కంకి దశలో నీట మునిగింది. నీటిలో వచ్చే ఒండ్రు మట్టి పంటపై చేరితే పంట దెబ్బతిని దిగుబడులు రాక ఆర్థికంగా నష్టపోతాం. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి.

తగ్గిన ఇన్‌ఫ్లో

- తుంగభద్ర డ్యామ్ నుంచి 6 గేట్ల ద్వారా 96,487 క్యూసెక్కులు దిగువకు

ప్రజాశక్తి - హోళగుంద

తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గింది. డ్యాం నుంచి రోజుకు 96,487 క్యూసెక్కుల నీటిని 6 గేట్ల ద్వారా దిగువ విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 105 టిఎంసిలు కాగా ప్రస్తుతం 102 టిఎంసిల నీటి నిల్వ ఉంది. గత నాలుగు రోజులుగా లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో కొనసాగగా గురువారం 97,751 క్యూసెక్కుల నీరు తుంగభద్ర డ్యామ్‌కు వచ్చి చేరుతోంది. కర్ణాటక రాష్ట్రంలో నాలుగు రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యామ్‌కు వరద పోటెత్తినట్లు తుంగభద్ర బోర్డు సెక్షన్ ఆఫీసర్ రాఘవేంద్ర తెలిపారు. వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. తెలిపారు. దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహశీల్దార్ రవి

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్.రవి తెలిపారు. గురువారం స్థానిక శ్రీరాఘవేంద్రస్వామి మఠం వెనుక ఉన్న తుంగభద్ర నది వరద నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట్ డ్యాం ఎగువన కురుస్తున్న వర్షాలకు డ్యాం నిండిపోవడంతో దిగువకు సుమారు లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని తెలిపారు. నది ఉధృతంగా ప్రవహిస్తోందని, భక్తులు, నదీతీర ప్రాంతాల ప్రజలు, జాలర్లు, పుట్టిన వేసే వారు నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పోలీసు శాఖ, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బంది పహారా కాస్తూ భక్తులను, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. విఆర్ఒ ఆనందం ఉన్నారు.

నదీతీరంలో అప్రమత్తంగా విధులు నిర్వహించండి



నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ రవి

తుంగభద్ర వరద ఉధృతి పెరగడంతో పోలీసు సిబ్బంది, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ ఆదేశించారు. తుంగభద్ర డ్యాం నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల ప్రవాహం ఉధృతంగా ఉందని తెలిపారు. భక్తులు, నది పరివాహక గ్రామాల ప్రజలు, జాలర్లు, పుట్టి నిర్వాహకులు నదిలోకి వెళ్లకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. విఆర్ఒ భీమనగౌడు, గ్రామ కార్యదర్శి నాగరాజు, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు ఉన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆస్పరి సచివాలయం-1, 2లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును ఎంపిడిఒ గీతావాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆధార్ కార్డులో నేమ్స్, డేట్ ఆఫ్ బర్త్ కరెక్షన్, అడ్రస్ మార్పు, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్, ఆధార్ అప్‌డేట్ చేయడం ఆధార్ క్యాంపు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈనెల 25న చిగిలి, నగరూరు, తంగరడోణ గ్రామాల్లోని సచివాలయంలో ఆధార్ క్యాంపులు ముగుస్తాయని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపిడిఒ

విద్యార్థుల ఇబ్బంది

ఆధార్ కార్డులో నేమ్స్ కరెక్షన్, డేట్ ఆఫ్ బర్త్ సరిచేసుకోవడానికి విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఆధార్ కార్డులో కరెక్షన్ కోసం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో స్టడీ సర్టిఫికెట్, టిసి తీసుకుని ఎంతో ఆశగా సచివాలయానికి వచ్చారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ ఉంటేనే పేర్లు, డేట్ ఆఫ్ బర్త్ కరెక్షన్ చేయడానికి వస్తుందని చెప్పడంతో చేసేది లేక విద్యార్థులు వెనుదిరిగి వెళ్లారు.

రాష్ట్రస్థాయికి ఉరుకుంద విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉరుకుంద విద్యార్థులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించి ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు గట్టూరు ఈరన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. క్రీడల్లో హైస్కూల్ విద్యార్థులు బాగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో అండర్-14లో జిల్లాస్థాయిలో రాణించి 9వ తరగతి విద్యార్థి నాగరాజు బంగారు పతకం సాధించారని తెలిపారు. ప్రస్తుతం సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హైస్కూల్ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయిలో పాల్గొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు సునీత దేవి, పిఇటి రమేష్ పాల్గొన్నారు.

పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కస్తూరిబా గాంధీ పాఠశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీని పారదర్శకంగా చేపట్టాలని పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి రాజేష్, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కెజిబివిలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఉన్నతాధికారులు విడుదల చేశారన్నారు. ఈ పోస్టుల భర్తీలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, ప్రతి పోస్టులో రోస్టర్ విధానంలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజు, ఆర్యన్, విశ్వ, అనిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

పెళ్లి ఇంట విషాదం

- ఆటో బోల్తా పడి పెళ్లి కొడుకు మామ మృతి

- శోకసంద్రంలో పెళ్లి కొడుకు కుటుంబం

ప్రజాశక్తి - మంత్రాలయం



ఖాజా హుస్సేన్ (ఫైల్)

పెళ్లి ఇంట విషాదం నెలకొంది. ఆటో బోల్తా పడి పెళ్లి కొడుకు మామ మృతి చెందగా కుటుంబం శోకసంద్రంలో మునిగింది. వివరాలిలా ఉన్నాయి... స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన ముల్లా ఖాజా హుస్సేన్ రెండో కుమారుడు ముల్లా ఖాసీంకు అదే రాఘవేంద్ర నగర్ కాలనీలోని కట్టుబడి ఖాసీం వలీ రెండో కుమార్తెతో నవంబర్ 1న నిఖా (పెళ్లి) చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. బంధువులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు పెళ్లి పత్రికలు పంచుకున్నారు. బుధవారం పెళ్లి బట్టలు, సరుకులు తెచ్చేందుకు తల్లి మదీనాబీ, మేనత్త మాబీతో పాటు మామ ఖాజా హుస్సేన్, బావమరిది బందేనవాజ్ రషీదతో కలిసి ఆటోలో ఆదోని వెళ్లారు. ఆదోని నుంచి మాధవరం మీదుగా మంత్రాలయం వస్తుండగా ఓం నగర్ సమీపంలో ఉన్న పురంధర ఆశ్రమం వద్ద రోడ్డు పక్కన మట్టి కుప్పను ఎక్కిన ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ఖాజా హుస్సేన్, బందేనవాజ్‌ను కర్నూలుకు తరలించారు. ఖాజా హుస్సేన్ (55) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందగా తల్లి మదీనా బీ, మాబీ, రషిదాలు ఆదోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన వగరూరు గ్రామానికి తరలించి గురువారం అంత్యక్రియలు చేపట్టారు. రోడ్డుపై మట్టి కుప్ప ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు వాపోతున్నారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE ADONE
OS NO. 163/1021

BETWEEN:
K.S.Dattatreya. ...Plaintiff
And
G.Venkata Ramudu. ...Defenders

NOTICE

To:
G.Venkata Ramada, S/o G. Linganna, Hindu, Aged about 45 years, Business, R/o H. No. 21/404/21 Indira Nagar, Adoni, Kumool Dist. Currently Resident of Marella Village, Tuggali (M), Kumool Dist.
Cell No. 9949081524, 6281599292

Whereas the above-named plaintiff has filed above suit against You. The Hon'ble Court was pleased to summon you by way of paper publication. Therefore, you are hereby directed to appear before this Hon'ble Court on 15/11/2024 at 10:30 AM either in person or through your Advocate and file your objections if any, failing which the matter will be decided in your absence.

L.K. Jeevan Singh,
BE, LL.B
Advocate for Plaintiff

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.ఎస్.నెం.471/2019

యం.నాగరాజు. ...వాది

వర్సెస్

పి.వి.నాగరాజు గుప్త తండ్రి పి.రామసుబ్బయ్య
ఇంటి నెం.86/220, శ్యామలానగర్, కర్నూలు.
...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ॥2,22,472.00లు ముందు వడ్డి, కోర్టు ఖర్చులు, రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 18-11-2024 తేదిన పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీపరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుమేరకు)

జి.నాగశేషయ్య,
వాదపరం అడ్వకేట్,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఇ.పి.నెం.277/2018 ఇన్ ఓ.యస్.909/2015

యం.కె.మురళీమోహన్. ...డిక్రిహెూల్డర్
-Vs-
బి.కుబేరగుప్త. ...జె.డి.అర్

జె.డి.ఆర్ కు ఆర్డర్ 21 రూల్ 54 సి.పి.సి ప్రకారం నోటీసులు

బి.కుబేరగుప్త తండ్రి కుబేరగుప్త
వయస్సు 46 సంవత్సరాలు, హిందు, వ్యాపారం,
ప్లాట్ నెం.204, వి.సి.టవర్స్, ప్రకాష్‌నగర్, కర్నూలు.

పై నంబరు అర్జీలో డిక్రిహెూల్డర్ మీ పైన పొందిన డిక్రీని అమలు చేయుటకు మరియు నీ యొక్క స్థిరాస్థిని జప్తుచేయుటకుపై అమలు అర్జీ నీపై దాఖలు చేసియున్నాడు. నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 06-12-2024 వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు అర్జీ విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 6-12-2024

టి.ఈశ్వర్‌బాబు,
డి.హెచ్.ఆర్ తరుపు న్యాయవాది.
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ.ఎ.నెం.431/2023 ఇన్ ఓ.ఎస్.నెం.61/2021

సజ్జన గాండ్ల శ్రీదర్. ...వాది/అర్జిదారు

వర్సెస్

హెచ్.ఆకులు హషం బాష
తండ్రి ఆకుల షేక్షావలి ఇంటి నెం.10-68/39,
పెద్దమార్కెట్ దగ్గర, కర్నూలు. ప్రస్తుతం ఇంటి నెం.13-97-1-1,13వ వార్డు, కోడుమూరు గ్రామము, కర్నూలు జిల్లా. ...ప్రతివాది/రెస్పాండెంటు

ప్రతివాది/రెస్పాండెంటుకు ఆర్డర్-34, రూల్-5 మరియు సెక్షన్ 151 ప్రకారం నోటీసు

పై నెంబర్ దావాలో వాది/అర్జిదారు షెడ్యూలు దాఖల ఆస్థిపైన ప్రతివాది/రెస్పాండెంటు పైన పొందిన ప్రిమిలినరి డిక్రిని, ఫైనల్ డిక్రీగా చేయమని కోరుతూ అర్జిదాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది/రెస్పాండెంటు అయిన నీకు ఆక్షేపణ ఉన్న 28-11-2024 తేదిన పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీపరోక్షమున విచారించి తీర్మానింపబడును.

షెడ్యూలు : కర్నూలు రిజిష్టర్ డివిజన్, కోడుమూరు సబ్ డివిజన్, కోడుమూరు మం॥ కోడుమూరు గ్రామ పంచాయితి బోర్డు దాఖలా కోడుమూరు గ్రామము 13వ వార్డులోని 13-07-1 తెలుపు నెంబరు గల ఇంటికి చెక్కుబంది. తూర్పు-ఆకుల ఖాజా హుశేన్ ఇల్లు, పడమర-రస్తా, ఉత్తరం-మాలసాహెబ్ ఇల్లు, దక్షిణం - బి.కౌలుట్ల ఇల్లు ఈ హద్దులకు లోనైన ఇంటికి కొల్తలు: తూర్పు-పడమర-48:3 అ. నలభైయినిమిదిపాయింటు మూడు అడుగులు, ఉత్తరం-దక్షిణం-15 అ. (పదిహేను అడుగులు) ఐరసి : 723.75 చ.అ.లు లేక, 80.4 చ.అ.లు గలది.

(కోర్టు వారి ఉత్తర్వుమేరకు)

యిస్కాల శ్రీనివాసులు,
వాదిపరం అడ్వకేటు, కర్నూలు.



కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- వెల్లాల మధుసూధనశర్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కూటమి ప్రభుత్వానికి బిజెపి నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం బిజెపి నాయకులు మధుసూదనశర్మ, మున్సిపల్ కౌన్సిలర్ లలితమ్మ మాట్లాడారు. ఎండోమెంట్ దేవస్థాన పాలకమండలి కమిటీల్లో, ప్రతి పాలకమండలి కమిటీలో ఇద్దరు బ్రాహ్మణులు ఉండేటట్లు చూస్తామని, అందుకనుగుణంగా బిల్లును అసెంబ్లీలో ఆమోదించడానికి ముఖ్య మంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం సంతోషకర మని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ పరిపాలనలో బ్రాహ్మణులకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. బ్రాహ్మణులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా కష్టనష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, పురంధేశ్వరికి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి, కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్

ప్రజాశక్తి - చిప్పగిరి

అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ తెలిపారు. గురువారం నంచర్ల గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, కాలువల్లో ఉండిపోయిన ఒండ్రు మట్టిని పంచాయతీ కార్మికుల చేత శుభ్రం చేయించి, వీధివీధిన బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నివాస ప్రాంతాల్లో అశ్రద్ధ చేయకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయించుకుంటూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మహిళలకు సూచించారు. వేస్ట్ పదార్థాలను, బట్టలు ఉతికిన వేస్ట్ నీటిని బయట వేయడం మానుకోవాలని మహిళలను కోరారు.

సమస్యలపై వచ్చిన రైతులను ఇబ్బంది పెట్టొద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరి: వినతుల స్వీకరణను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి వచ్చిన రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా, ఎక్కువ సార్లు కార్యాలయాలకు తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని నంచర్ల గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి పెద్దన్న, మండల సర్వేయర్ నారాయణ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్‌డిఒ భరత్ నాయక్ పాల్గొని గ్రామసభ పనితీరును, రీసర్వేపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులకు ఈనెల చివరి నాటికి పరిష్కారం చూపాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. టిడిపి సీనియర్ నాయకులు శివలింగ, పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్, విఆర్ఒలు మల్లికార్జున, రంగన్న, చంద్ర నాయక్, వన్నూరు స్వామి, అంజి, సర్వేయర్లు వినోద్ కుమార్, అశ్విని, గోవర్ధన, హనుమా నాయక్ పాల్గొన్నారు.



మంత్రాలయంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రవి

మంత్రాలయం : గత ప్రభుత్వంలో రీసర్వే ద్వారా అన్యాయం జరిగిందని అనుకున్న రైతుల కోసం ప్రస్తుత ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని, భూ సంబంధిత సమస్యలు ఉన్న రైతులు రీసర్వే చేయించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని తహశీల్దార్ ఎస్.రవి కోరారు. గురువారం మండలంలోని వగరూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే భూ రీ సర్వేపై నిర్ణయించిన తేదీల్లో గ్రామసభల ద్వారా వినతులు స్వీకరిస్తున్న ట్లు చెప్పారు. రైతుల నుంచి భూ సంబంధిత సమస్యలపై 24 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్ పాల్గొన్నారు.



ఆదోనిలో

ఆదోని (రూరల్) మండలం సాంబగల్ గ్రామం లో గ్రామసభ నిర్వహించారు. ఆర్ఐ పెద్దయ్య మాట్లాడుతూ... మొదటి విడతలోనే భూముల రీసర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వే చేసేటప్పుడు భూములు కలిగిన రైతులందరూ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇప్పటివరకు రికార్డుల్లో నమోదైన భూములతో పాటు నమోదు కాని అన్ని రకాల భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల దీర్ఘకాలికంగా ఉన్న భూసమస్య లు పరిష్కారం అవుతాయన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. **హోళగుంద** మండలం నాగరకన్వి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ సతీష్, డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ ముకుందరావు పాల్గొన్నారు. **హాలహర్వి** మండలం నిట్రవట్టి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. తనకు ఆహ్వానం లేదని సర్పంచి విజయమ్మ విఆర్ఒ రమేష్‌ను నిలదీశారు. తహశీల్దార్ నజ్మ భాను, డిటి బ్రహ్మయ్య, విఆర్ఒ రమేష్ పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

- ట్రైయినీ డీఎస్పీ ఉషశ్రీ

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రైయినీ డీఎస్పీ ఉషశ్రీ హెచ్చరించారు. గురువారం ఆస్పరి మండలం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ట్రెయినీ డీఎస్పీ ఎన్.ఉషశ్రీ రెండు నెలల పాటు శిక్షణ పొందేందుకు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ రెండు నెలలు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తుస్తున్నానని తెలిపారు. మండలంలో ఇసుక రీచ్ పాయింట్లను ప్రభుత్వం ఎక్కడ ఏర్పాటు చేసిందని సిఐ మస్తాన్ వలీని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఇసుకను అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు, ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వెంగలాయదొడ్డి చెరువు, పుప్పాలదొడ్డి, యాటకల్లు, డి.కోటకొండ, బైలు పత్తికొండ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను నిషేధించామని తెలిపారు. అక్కడ తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహశీల్దార్లు, విఆర్ఒలు, మహిళా పోలీసులు అక్రమాలు జరగకుండా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ ఉంటారన్నారు. స్థానిక అవసరాల నిమిత్తం ఉచిత ఇసుకను తరలించేందుకు రెవెన్యూ, పంచాయితీ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఉచిత ఇసుక సరఫరాపై ఫిర్యాదులు చేసేందుకు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నెంబరు 18004 256042ను సంప్రదించాలన్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి

- రోటరీ క్లబ్ ఆదోని అధ్యక్షులు సందీప్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించి పోలియోరహిత సమాజంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రోటరీ క్లబ్ ఆదోని అధ్యక్షులు సందీప్ రెడ్డి తెలిపారు. గురువారం ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అక్షరశ్రీ, శ్రీమల్లికార్జున విద్యాలయ విద్యార్థులతో కలిసి రామజల రోడ్డు నుంచి జిఎం రోడ్డు, తిక్కస్వామి దర్గా కంట్రోల్ రూమ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలియో నిర్మూలన కోసం ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్‌గేట్స్, రోటరీ క్లబ్ కలిసి పోలియో చుక్కల మందు ఖర్చులను భరిస్తున్నారని తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులు శ్రీధర్ రెడ్డి, జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, ప్రశాంత్ గాంధీ, సోమశేఖర్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, రాయ చోటి సుబ్బయ్య, విట్టా రాజేష్, పద్మనాభయ్య శెట్టి, సీనియర్ రిపోర్టర్ హుస్సేన్ బాష పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో భోజనం వసతి కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రయివేట్ కళాశాలలకు ఫీజులు చెల్లించుకోలేక పేద విద్యార్థులు అవమానాలకు గురవుతున్నారని తెలిపారు. పాదయాత్రలో లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు. స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న గ్రామస్తులు

నబీరసూల్ కుటుంబానికి మల్లెల గ్రూప్స్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన కటిక నబీరసూల్ కుటుంబానికి మల్లెల గ్రూప్స్ ఛైర్మన్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు ఆర్థిక సహాయం అందజేశారు. నబీరసూల్ విలేజ్ బుక్ కీపర్‌గా పని చేస్తూ గత జనవరిలో మృతి చెందారు. నబీరసూల్ గ్రామంలో అందరివాడిగా మెలిగే వారు. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామానికి చెందిన వారు సామాజికవేత్త, మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం నబీ రసూల్ కుమార్తె వివాహానికి రూ.20 వేల ఆర్థిక సహాయం గ్రామానికి చెందిన సీనియర్ ఎల్ఐసి ఏజెంట్ ఎన్.నరసింహులు, గ్రామ పెద్దలు బి.రంగస్వామి, శ్రీనివాసులు, వీరేశప్ప ద్వారా అందజేశారు.

బాలికల వసతి గృహంలో

పత్తికొండ సివిల్ జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని బీసీ బాలికల వసతి గృహాన్ని పత్తికొండ సివిల్ కోర్టు జడ్జి ఎంఎస్.భారతి గురువారం తనిఖీ చేశారు. హై కోర్టు ఆదేశాల మేరకు హాస్టల్‌ను తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు. హాస్టల్లో విద్యార్థినులకు ఇచ్చే భోజనాన్ని, గదుల్లో ఉండే వసతి ఏర్పాట్లను పరిశీలించడంతోపాటు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలని ఆమె విద్యార్థులను అడిగారు. హాస్టల్లో సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానిక సిఐకి తెలియజేయాలని విద్యార్థినులకు ఆమె సూచించారు. గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్, కోర్టు సిబ్బంది రాఘవేంద్ర, మంజుల, హాస్టల్ వార్డెన్ సుజాత పాల్గొన్నారు.

'ఎస్సీ కాలనీలో నీటి సమస్యను తీర్చండి'

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామంలో గల ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శోభారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాధవరం గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీరు అందక దళితులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని దళిత పేటలో ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి గుమ్మిలను ఏర్పాటు చేసి నీటి కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ మండల అధ్యక్షులు మారెప్ప, మండల ఉపాధ్యక్షులు జి.సురేష్, తలమారి నడిపి తిక్కన్న, మిక్కిలి జయరాజు, ఏలియా, అశోక్ పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఇ.పి.నెం.42/2023 ఇన్ ఓ.యస్.8/2023

యస్.మల్లికార్జున రెడ్డి. ...డిక్రిహెూల్డర్
-వర్సెస్-
అత్తులూరి విజయ్‌కుమార్. ...జె.డి.అర్

వేలం ప్రకటన

ఈ క్రింద కనబరచిన స్థిరాస్థిని కోర్టువారు 26-11-2024 వతేది ఉదయం 10.30 గంటల నుండి కోర్టు ప్రంగణములో వేలం వేయుదురని తెలియజేయడమైనది.కావలసిన వారు వేలంలో పాల్గోన వచ్చును.

షెడ్యూలు :

Kurnool Division Sub-Division, Kurnool Municipal Corporation, Kallur Gramapanchayath, Kallur (V) In Survey No.328/1A,328/1C,387/3 Land piki, Total extent A.C.0.05.3/4 cents in that Northern side Ac.0.04.3/4 cents or 38.5 yards.

Bounded as
East : Land of SAP Camp.
West : Remaining Land of Somisetty Padmavathi
North : Place of Somisetty Srinivasulu.
South : Place of Somisetty Padmavathi.

Measurements :-
1st Item : East-West 57 Feet or 17.3736 meters
North - South : 30 feet or 9.1440 meters
2nd Item : Eastern side : North-south : 14 Feet or 4.2672 meters
Western side : North -South : '0'Feet pr 0.0000 meters
Northern side : East - West : 57 feet or 17.3736 meters
Southern side : East - West : 57 feet or 17.3736 meters
Total Extent :2109 SFT or 234.33 Sq. yards.
D.Hr. Value : Rs.2,00,000/-
Amin Value : Rs.60,00,000/-

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వేలం తేది : 26-11-2024

టి.ఈశ్వర్‌బాబు
డి.హెచ్.ఆర్ తరుపు న్యాయవాది.
కర్నూలు.